


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### కంగారు కాలం

**కొన్ని మన చిన్నప్పటి** విషయాలూ, ఇంకొన్ని నా పిల్లల చిన్నప్పటి విషయాలూ కలిపి రాస్తే, హిస్టరీ పుస్తకంలో "ఆంధ్రుల మధ్యతరగతి తిరుగుబాటు" అనే చాప్టర్ అవుతుంది.

మా చిన్నతనంలో ఎవరింటికైనా వెళ్తే వాళ్ళ పిల్లల కాలి హవాయి చెప్పులకి పిన్నీసులు వుండక పోతే, బోలెడు ఆశ్చర్యపోయేవాళ్ళం. అలాగే అమ్మలు జాకెట్లకి పిన్నీసులు ఒకటో, రెండో పెట్టుకోకపోయినా ఆశ్చర్యంగా వుండేది. అసలు పిన్నీసు అనేదాని మీదే మన బాల్యం అంతా ఆధారపడి జరిగిపోయింది. చెవిలో గులిమి తియ్యడానికి పిన్నీసు కావాలి, పౌడర్ డబ్బాకి చిల్లు పొడవడానికి పిన్నీసు కావాలి. చెప్పులకీ, బట్టలకీ పిన్నీసులు కావాలి. ఆడపిల్లలకి తలలో గులాబీ పువ్వు పెట్టుకోడానికి పిన్నీసు కావాలి. సినిమా హాల్ క్యూలో, ముందున్న రౌడీ కుర్రాడు కావాలని ఆడపిల్లని తాకుతుంటే గుచ్చడానికి, ఆడపిల్లల సెల్ఫ్ డిఫెన్స్‌కి పిన్నీసు కావాలి. ఒక్కోసారి ఎక్కడైనా పడి, పిల్లలు చర్మం వూడుతూ వస్తే తల్లులు పిన్నీసులు పెట్టేస్తారేమో అనిపించేది. సో... గొడుగులకీ, నవారు మంచాలకీ కూడా పిన్నీసులు పెట్టడానికి, అమ్మల మెడల్లో నానుతాడుకి బంగారం తక్కువా, పిన్నీసులు ఎక్కువా వుండేవి.

మా అక్క కూతురైతే వాళ్ళమ్మతో "అమ్మా పెద్దయ్యాకా నాకు నీలా గొలుసూ, గొలుసుకి బంగారం పిన్నీసులూ చేయించాలి" అని అడిగింది.

ఇంకా ఆశ్చర్యం అమ్మల మెడల్లో మంగళసూత్రాలకి సొట్టలు వుండకపోవడం.. డబ్బా మూతలు ఎలా తీస్తారు? మంగళ సూత్రాలతో కాదా? అని ఆశ్చర్యం. పోపుల డబ్బాల్లో అమ్మలు దాచే చిల్లర డబ్బులకి చాలా ప్రాముఖ్యం వుండేది. ఇంటి ఖర్చుల్లో నాన్నల కళ్ళు కప్పి దాచే చిల్లర ఎక్కడ దాస్తారో, నాన్నలకి కూడా తెలుసు.

ఇంక పిల్లలకి డబ్బులు ఎలా వస్తాయి? స్వయం ఉపాధి వుండేది. ఇంటికొచ్చిన చుట్టాలకి వున్నన్నాళ్ళూ "మంచినీళ్ళు కావాలా? గుడికి వెళ్దామా? నా సైకిలుంది" అని తిప్పుతుంటే వెళ్ళేటప్పుడు పిల్ల చేతిలో "ఐస్‌ఫ్రూట్ కొనుక్కోండి" అని రూపాయి పెట్టేవారు. మొన్న మా అబ్బాయి 760/ - రూపాయిలు ఐస్‌క్రీమ్ తెస్తే ఆ రోజులు గుర్తొచ్చాయి. కానీ, బండి వెనుక పరిగెత్తి "ఆరెంజ్ రంగు పుల్ల ఐస్" తిన్న రోజులు మధురం కదా!

ఇంక అత్తయ్యలూ, పెద్దమ్మ వున్నన్నాళ్ళు వుండి "నా తల చూడవే.. దురదగా వుంది. రైల్లో ఎదుటి బెర్త్ ఆవిడ తలనిండా పేలే.." అని చూపించుకుని, వెళ్ళేటప్పుడు రెండు రూపాయల కాయితం ఆడపిల్లల చేతిలో పెట్టి, "గాజులు వేయించుకో" అనేవాళ్ళు.

ఇంక జ్వరం వస్తే ఎందుకనో.. ఒక డబ్బా పెట్టి డబ్బా నిండా చిల్లర డబ్బులు వేసి ఇచ్చేవారు. ఇవి కాకుండా "న్యూస్ పేపర్లూ, తరగతి మారినప్పుడు పాత నోట్ బుక్కులూ" అమ్మడం. అమ్మా నాన్నా ఉదారంగా వుంటే టెక్స్ట్ బుక్‌లు కూడా సెకండ్ హాండ్‌లో అమ్మడం ద్వారా కొంత పెద్ద మొత్తం సంపాదించేవాళ్ళం. పాత పేస్ట్ డొక్కులూ, ఇనపసామాన్లూ లాంటివి కూడా అమ్మి ఒక్కోసారి సెనగలూ, పుట్నాలూ సంపాదించేవాళ్ళం.

అప్పట్లో బిచ్చగాళ్ళు వచ్చి "అమ్మా" అనగానే, ఇల్లాళ్ళు మిగిలిన అన్నం, పులుసూ, ఏదీ కాని వేళ అయితే బియ్యం వేసేవారు. ఆ బియ్యం వెయ్యడానికి ఆడుకుంటున్న పిల్లల్ని కేకేసేవారు. చిన్న చిన్న చేతులైతే తక్కువ బియ్యం వేస్తారని. నేను మాత్రం బియ్యంలో పావునిండా తెచ్చివేసేదాన్ని.

ఆర్థికంగా మధ్య తరగతి వాళ్ళు, మొదటివారం వదిలేస్తే రెండోవారం నుండీ ఎంతో ఇబ్బంది పడ్తూనే వుండేవారు. అందరి ఇళ్ళల్లో రెండు 'అల్మారాలు' వుండేవి. పాత సినిమాల్లో చూపించినట్లు, నగలూ, కట్టలు, కట్టలు డబ్బులూ వున్న సేఫ్‌లు ఎన్నడూ చూడలేదు. బట్టలు పెట్టుకోడానికి మా ఇంట్లో పనస చెక్కతో చేసిన ఓ అల్మారా, వంట గదిలో పాలూ, పెరుగూ ఎలుకలబారినుండి కాపాడ్డానికి చిన్నబోనులాంటి అల్మారా వుండేది. దాన్నే ఫ్రిజ్‌లా ఫీలయ్యేవాళ్ళం. పైన తాళ్ళతో ఉట్టికట్టి చల్ల దాచడం, సినిమాల్లోనే చూసేదాన్ని. కొన్నాళ్ళయ్యాక ఇళ్ళల్లోకి "గోద్రెజ్" అల్మారాలొచ్చాయి. పెట్టుకోడానికి బోలెడు బట్టలూ, నగలూ వుండేవికాదు. కానీ లాకర్‌లో బోలెడు కాయితాలుండేవి.

నాన్నలు ప్రతి రసీదూ, బిల్లూ దాచి వుంచేవాళ్ళు. అవికాక మధ్య తరగతి వాళ్ళకి ముఖ్యమైన డాక్యుమెంట్లు, పాస్‌బుక్కులూ పాతిక రూపాయిలన్నా ప్రతినెలా అప్‌డేట్ చేయించేవాళ్ళు. పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ బుక్, పిల్లల ఎస్.ఎస్.సీ మెమోలు.

యాభైలు దాటాకా మగవాళ్ళు, రెగ్యులర్‌గా ఓ ఫోల్డర్‌లోని తీసి అన్ని కాయితాలూ తీసి చూసుకునేవారు. ఆ ఫోల్డర్ బ్రౌన్ రెక్సిన్ అయి వుండేది. మేము మా బొమ్మలు చూసుకున్నట్లు, మగపిల్లలు వాళ్ళ గోళీలు లెక్కపెట్టుకున్నట్లు.

అమ్మలకి నాలుగు దాపుడు చీరలూ, ఐదు ఆరు రోజువారీ కట్టుకునే చీరలూ వుండేవి. దాపుడు చీరలే, రెండేళ్ళు పోయాకా, ఇంట్లో చీరలు అయ్యేవి. వాళ్ళ పెళ్ళిళ్ళకి కొన్న రెండు పట్టు చీరలూ, పాతవి అయితే స్టీలు సామాన్లు ఇచ్చే అమ్మికి ఇచ్చి "నిండా జరీ.. ఆ గంగాళం ఇస్తావా?" అని బేరం పెట్టేవారు. ఆ అమ్మి ఓ చిన్న వక్కపొడి భరిణలాంటిది చూపించి "ఇది ఇస్తా" అనేది. వాళ్ళు అఫెండ్ అయి "అయితే వద్దులే.. మా సక్కుబాయి వస్తుంది. పెద్ద స్టీలు డబ్బా ఇస్తానంది" అనేవారు. ఆ అమ్మి "ప్యాంట్లూ, షర్టులూ వుంటే వెయ్యండి. ఇస్తా" అనేది. మొగుళ్ళకి తెలీకుండా, కాఫీపొడి రంగు ప్యాంటుకి చిన్న చిల్లు పెట్టి అది వేసేసేవారు. "ఇంకా తీసుకురా" అనే పాట అలాగే వుండేది. "నా చీర విప్పి వెయ్యనా? తలుపు వెనుక నిలబడీ?" అని అమ్మమ్మ అరిస్తే "కోప్పడకమ్మా.. ఈ గిన్నె తీస్కో మూత కూడా ఇస్తున్నా.." అని ఓ చిన్న టిఫిన్ డబ్బా ఇచ్చేవారు.

కొంతమంది పనిమంతులయిన మగవాళ్ళు ఆదివారాలు, ఇళ్ళకి చిన్న చిన్న మరమత్తులూ, రేడియోలూ, ఫ్యాన్లూ విప్పి, వాటి నిర్మాణక్రమం తెలుసుకోడాలూ చేసేవారు. అది అప్పటిదాకా 'సైగల్' లా పాడిన ఫ్యాన్, వీళ్ళ రిపేర్ల తర్వాత కిషోర్ కుమార్‌లా "హుళ్ళే హుళ్ళే.. హుళ్ళే" అని పాడేది.

మా నాన్నగారు మాత్రం, రాని పనుల్లో వేళ్ళు పెట్టేవారు కాదు. ఆదివారం వస్తే తలంటు పోయించుకోవడం, ఆ బట్టతల అంటడానికి, చిన్న సత్తుగిన్నెడు నూనె, పావుకిలో కుంకుడుకాయలూ, పావుకిలో సున్నిపిండీ, అమ్మకి అలుపొచ్చేసేది. బాయిలర్ నిండా

నీళ్ళు మరిగి మరిగి వుండాలి. ఆయన అసురాసుర్లు అయి, అమ్మ వంటింట్లో నేల మీద పడి వుండేది. మా తల అంటేటప్పుడు, అమ్మది ఓ పాత జాకెట్టు కళ్ళకి అడ్డంగా పెట్టుకోమనేవాళ్ళు, కళ్ళల్లో కుంకుడు రసం పడుకుండానూ.

మా పిల్లల టైంలో నేను ఒంటికి నూనె రాసి, సున్నిపిండి పెట్టి నలుస్తుంటే "పాములు.. అన్నయ్యా, నాకే పెద్ద పాములొస్తున్నాయి" అవి మా చిన్నాడు ఆనందపడేవాడు. పిల్లలు చిన్నప్పుడు కొన్ని భయంకరమైన పనులు చేసేవారు. ఎవరు కాఫీ తాగుతున్నా, వీళ్ళూ ఓ చిన్న గ్లాసు పట్టుకుని సిద్ధం అయ్యేవాళ్ళు. పెద్దవాళ్ళు తాగుతూనే ఓ చుక్క ఇందులో పోసేవారు.. అదే ఇబ్బందికరం అనుకుంటే, వీళ్ళు ఒక్కోసారి పెద్దాళ్ళ కళ్ళు కప్పి, కప్పుల్లో పెద్దవాళ్ళు వదిలేసిన ఆఖరి చుక్కలన్నీ ఓ కప్పులోకి వంచుకుని, అరకప్పు కాఫీ తాగేసేవారు.

ఇంక ఆఖరివారంలో పేస్ట్‌ట్యూబ్‌లు అప్పడాల కర్రతో వత్తి. దాని ప్రాణం కడంటిపోయేదాకా వాడుకోవడం, పౌడర్ డబ్బా అయిపోతే కొనకపోవడం... తిలకం సీసాలో నీళ్ళు పోసి అది పెట్టడం. ఇలా అనేక 'ఎ్రటానిటీన్' చేసేవాళ్ళు. ఇప్పుడంటే "మిల్లెట్ రెస్టారెంట్స్" అని స్టైలుగా వచ్చాయి. బోలెడు ఖరీదులు పోసి వెళ్తున్నారు కానీ, మా చిన్నతనంలో అమ్మమ్మ బొబ్బర్ల రొట్టె చేసి పెట్టేది, సజ్జలతో కూడా చేసేది, జొన్న రొట్టె, రాగి సంకటీ, గోధుమ అన్నం. అన్నీ చేసేది. మేం "తినమంటే తినం" అని భీష్మించుకునే వాళ్ళం.

ఊళ్ళల్లో వున్న వాళ్ళకెవరికన్నా ఫోన్ చెయ్యాలంటే రాత్రి ఏడు దాకా ఉండి హాఫ్ రేట్‌లో ఎస్.టి.డి కాల్ చెయ్యొచ్చని అప్పుడు చేసేవాళ్ళం.

కిరోసిన్ కోసం క్యూలు, రేషన్ షాపుల ముందు చక్కెరా, గోధుమల కోసం క్యూలు, పాలబూత్ దగ్గర క్యూలు, ఎలక్ట్రిసిటీ బిల్లుకట్టడానికి క్యూలు, బస్సు డిపోల్లో, రైల్వే స్టేషన్లలో, సినిమాహాళ్ళ దగ్గర ఎక్కడ చూసినా క్యూలే. కానీ రోడ్లమీద రిక్షాలూ, సైకిళ్ళూ తప్ప ఇన్ని వాహనాలు వుండేవికావు. ఆర్.టీ.సీ బస్.. రయ్యమని పోయేది. సీటు దొరికితే మహదానందం. లేదా ఒంటికాలిమీదే నిలబడేవాళ్ళం. మనిషికీ మనిషికీ సందు లేని చోట, కండక్టర్ గజ ఈతగాడులా తోసుకుని "టికెట్... టికెట్" అని మోచేతులతో ఈదుతూ వచ్చేవాడు.

రిక్షా ఎక్కితే, ఎత్తు వచ్చినప్పుడు రిక్షా అతను దిగి నడవమనేవాడు. ఇన్ని ఆటోలు లేవు. నాకు మొదటిసారి నెప్పులొస్తున్నా, రిక్షాలోనే. 'డంగోరియా' ఆస్పత్రికి వెళ్ళాను. పిల్లలు అది విని "మనిషి తొక్కుతుంటే ఎలా కూర్చునేవాళ్ళు? జాలి వేసేది కాదా?" అంటున్నారు.

తర్వాత ఆటోలొచ్చాయి. అవి పది పన్నెండు మందిదాకా ఎక్కితే... ఆస్తమా పేషెంట్ హిమాలయాలు ఎక్కుతున్నట్లు శబ్దం చేస్తూ, ఏ నిమిషానైనా ప్రాణాలు పోతాయి అనేట్లు ఎత్తులు ఎక్కేవి. "బస్సులు కూడా నిండు గర్భిణీల్లా కదిలేవి" అని రచయితలు రాసేవారు. నేను అటువంటి బస్సుల్లో పెద్దవాడిని కడుపుతో వున్నప్పుడు ఎనిమిదో నెలదాకా కాలేజ్ కెళ్ళాను.

కారు వస్తే వీధిలోకి విచిత్రంగా వుండేది. రైల్వే స్టేషన్‌లో నల్లరంగు టాక్సీలు, పైన టాప్ పసుపు రంగుతో వరుసలు తీరి వున్నా, మధ్యతరగతి వాళ్ళు అటుకేసి చూసేవాళ్ళు కాదు.

మా చిన్నప్పుడు, ఉద్యోగస్తురాలు కాబట్టి మా అమ్మ లావిష్‌గా ఖర్చు చేసేది. మా పిల్లలందరినీ సుధా హోటల్‌కీ, సినిమాకీ తీసుకెళ్ళేది. ఎగ్జిబిషన్‌కి తీసుకెళ్ళేది. నెలకి 18రూపాయలు పెట్టి ఒకటి, రెండు చీరలు కొనేది. కొన్ని రెండుగా చింపి పెద్దమ్మ కూతుళ్ళు ఓణీలు వేసుకునేవారు. ఆర్.టీ.సీలో అమ్మ సింగర్ కాబట్టి, కల్చరల్ ప్రోగ్రామ్స్ అంటూ, వూళ్ళకి ప్రతిసారీ మాలో ఒకళ్ళని తీసుకెళ్ళేది. ట్రావెలర్స్ బంగళాలో వుండేవాళ్ళం. హోటల్స్‌లో తినడం, స్పెషల్ బస్సుల్లో, జీపుల్లో తిరగడం సరదాగా వుండేది. పిల్లలకి అస్తమానం చిరుతిండ్లు కొనిపెట్టలేరు కాబట్టి, ఇంట్లోనే బోలెడు మిఠాయిలూ, జంతికలూ, చేగోడీలూ, చెక్కలూ, వెన్నుండలూ అన్నీ చేసేవారు. మరచెంబు, మూతి దగ్గర పిండితో అద్ది 'గవ్వలు' చేసేవాళ్ళం.

భూమిలో పాతేసిన పెద్ద పెద్ద రోళ్ళల్లో రోకళ్ళతో మిరపకాయలూ అవీ దంచి ఊరగాయలు పెట్టేవాళ్ళు. బాయిలర్లలోకి రైలు బొగ్గూ, పిడకలూ లాంటివీ ఇళ్ళల్లో వుండేవి. కుంపటి మీద సన్న సెగన కాగి, ఎర్రగా మీగడ కట్టిన పాలతో పెరుగు తోడేస్తే.. ఆ రుచే రుచి.

ఇంక మా పిల్లల చిన్నతనానికి వచ్చేసరికి, మేం ఊళ్ళకి వెళ్తే ఓ మాత్రం పెద్ద హోటల్స్‌లోనే దిగేవాళ్ళం. బట్టలు కూడా 'చర్మాస్'లో కొనేవాళ్ళం. 'బాటా' చెప్పులూ, షూస్‌లాంటి బ్రాండెడ్ కొనేవాళ్ళం ఆటోలో స్కూల్‌కి పంపేవాళ్ళం. మా పుష్పక విమానం 'ఎల్.ఎమ్.ఎల్.వెస్పా' మీద అస్తమానం, ముందు బోలెడు సంచిలు తగిలించుకుని అమ్మా వాళ్ళింటి వచ్చేవాళ్ళం. అమ్మ దగ్గరకి వెళ్ళి వచ్చేటప్పుడు, బోలెడు పొడులూ, పిల్లలకి చిరుతిండ్లూ, సాంబ్రాణీ, పెరట్లో కాసిన కాయగూరలూ, నాకు చీరలూ లాంటి లగేజ్ చేరేవి. మా ఆయన 'వెస్పా కాదు ఓ ఎడ్లబండి కొనుక్కోవాలి" అని విసుక్కునేవారు. దీపావళి వస్తే మా ఆయన చాలా టపాకాయలు కొని, పిల్లలు కాల్చకపోతే తనే కాల్చేసేవారు. అంతెందుకు రిమోట్‌తో నడిచే కార్లూ, రైళ్ళూ కొని ముందు తను ఆడుకుని వీళ్ళకి ఇచ్చేవాళ్ళు.

మా పెద్దవాడు ఏడూ, చిన్నవాడు ఐదూ చదువుతున్నప్పుడు నేను మొదటిసారి ఓ టీ.వి సీరియల్‌కి(ఇలవేల్పు) పాట రాస్తే, విమానం టికెట్టు కొని నన్ను చెన్నై పిలిపించాడు సాయికృష్ణ (బాబాయి హోటల్, బాయ్ ఫ్రెండ్ తెలుగు సినిమాల్లో హీరోగా వేసాడు) అని నా మిత్రుడూ, ప్రొడ్యూసరూ. మా చిన్నవాడూ నాతో మొదటిసారి ఫ్లైట్ ఎక్కాడు. ఎంత థ్రిల్లింగ్‌గా అనిపించిందో! అలా స్వయంశక్తి మీదే ఫ్లయిట్ ఎక్కాను.

తరువాత రామానాయుడుగారు 'మధుమాసం' సినిమా స్క్రిప్టుకిగాను మళ్ళీ చెన్నై ఫ్లయిట్‌లో పిలిపించారు.

సినిమా ఫీల్డుకి వచ్చాక, స్టార్ హోటల్స్‌లో దిగడం, ఫ్లైట్స్ ఎక్కడం, ఔట్‌డోర్ షూటింగ్స్‌కి మలేషియాలవీ వెళ్ళడం, 'నాటా'కీ 'తానా'కీ అమెరికా రావడం పరిపాటి అయింది.

ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఎంతో విచిత్రంగా వుంటుంది. మనమేనా అవన్నీ దాటి వచ్చాం? అనిపిస్తుంది. ఇప్పుడు పిల్లలు 'నోవాటిల్', 'మేరియట్'కి తప్ప వెళ్ళరు. ప్రయాణం అంటే ఫ్లయిట్ కంపల్సరీ. కార్లో ఆఫీస్‌కి వెళ్తారు. లంచ్ బాక్స్‌లు అక్కర్లేదు. 'స్విగ్గీ'లో, 'జొమేటాస్'లో ఆర్డర్ చేస్తారు. బ్రాండెడ్ తప్ప బట్టలూ, జోళ్ళూ, కళ్ళజోళ్ళూ వాడరు. అసలు అన్న బట్టలు పొట్టివైతే తమ్ముళ్ళు వేసుకోరు. ఇంటిల్లిపాదికీ ఒకే బ్రాండ్ సబ్బులూ, నూనె, షాంపూ కొనకూడదు. ఎవరి బ్రాండ్స్ వాళ్ళకి.

రాత్రుళ్ళు ఆఫీస్ నుండి ఆలశ్యంగా వస్తే 'ఎందుకు లేట్ అయింది?' అని అడగకూడదు. హోటల్ కెళితే నలుగురం ఐదువేలు కార్డు గీస్తాం. సినిమా కెళితే నలుగురు పదిహేను వందలు. ఆ చెంపా ఈ చెంపా వాయిస్తారు. సమోసా 'ఐనోక్స్'లో ఎనభైరూపాయలు. పాప్‌కార్న్ అరవై, నీళ్ళ బాటిల్ ముప్పై, కూల్ డ్రింక్ నూటయాభై. గాలి పీలిస్తే మల్టీ ప్లెక్స్‌లు వాళ్ళు డబ్బులు అడగనందుకు సంతోషం.

మిక్సీలూ, గ్రైండర్లూ లేని రోజుల్లో ఉప్మా, చపాతీ పెద్ద టిఫిన్లు. రోజూ దోశా, ఇడ్లీ లాంటివి చేసేవాళ్ళు కాదు. ఏం పెడితే అది తిని బడికి వెళ్ళేవాళ్ళం. అవి తినమూ, ఇవి తినమూ అని పేచీలు లేవు. దసరాకీ సంక్రాంతికీ బట్టలు కొనేవాళ్ళు. రిటైరయి, డబ్బులొస్తే ఇల్లుకట్టుకునేవాళ్ళు. ఆడవాళ్ళకి జీవితంలో ఒకసారో రెండుసార్లో బంగారం కొనేవాళ్ళు.

మధ్యాహ్నాలు ఆడవాళ్ళు, వసారాల్లో కబుర్లు చెప్పుకుంటూ, మిరపకాయ తొడిమలు తీసుకోవడం, బియ్యం బాగు చేసుకోడం, చింతకాయ పచ్చడి, గింజ తీసుకోవడం అవన్నీ ఎంత మధురంగా వుండేవీ?

పండగలకీ, పబ్బాలకీ ఇంటినిండా చుట్టాలు చేరితే, కొత్తబట్టలూ, పిండివంటలూ, హాస్యాలూ, నవ్వులూ, కేకలూ ఎంత బావుండేవీ?

టీ.విలొచ్చి, మనుషులతో మాట్లాడకుండా చేస్తే, మొబైల్ ఫోన్స్ వచ్చి మనుషులని కలవకుండా చేసాయి.

అమ్మనైనా, నాన్ననైనా ఓ ఫోన్‌కాల్‌లో పలకరించేస్తారు. ఇంకా టైం లేకపోతే 'వాట్సప్'లో "వాట్స్అప్?" అని పలకరింపు.

ఫేస్‌టైంలో స్కైప్‌లలో మనవలని చూపించి మురిపించేస్తారు.

బంగారుకాలం పోయింది. కంగారుకాలం నడుస్తోంది. నడవనీయండి.

Post your comments

